క్లుప్తంగా

డ్రంకెన్ డ్రైవ్ కేసుల నమోదు



ధరూరు: వాహన తనిఖీల్లో భాగంగా ఆదివారం మండల పరిధిలోని చింతరేవుల గ్రామంలో నిర్వహించిన తనిఖీల్లో మద్యం తాగి వాహనం నడుపుతున్న వారిపై డ్రంకెయిన్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీహరి తెలిపారు. వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలని ఎస్‌ఐ పేర్కొన్నారు.

సంతలో వసతులు కల్పించండి



రాజోళి: కొత్త రాజోళిలో ప్రతి ఆదివారం నిర్వహించనున్న సంతలో వసతులు కల్పించాలని వ్యాపారులు, ప్రజలు కోరుతున్నారు. రోడ్డు మీదనే విక్రయాలు జరుపుతున్నట్లు వాపోతున్నారు. ఎండ, వాన నుంచి రక్షణ కల్పించాలని, దుమ్ము, ధూళితో విక్రయదారులు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. చిన్నపాటి షెడ్లు ఏర్పాటు చేసినా ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు కృషి



మానవపాడు: గ్రామాల్లో నాణ్యమైన విద్యుత్ సరఫరాకు విద్యుత్ అధికారులు చర్యలు చేపట్టారు. ఆదివారం మండలంలోని చెన్నిపాడు, మానవపాడు, గోకులపాడు గ్రామాల్లో ఎర్త్ సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో విద్యుత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కెనాల్‌లో మరమ్మతు పూర్తి చేయాలి

రాజోళి: ఆర్‌డీఎస్ కెనాల్‌లో మరమ్మతులు ఈ వేసవిలో పూర్తి చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు శశికుమార్, సీనియర్ నాయకులు సంజీవ రెడ్డి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గత రెండేళ్లుగా పనులు చేస్తూనే ఉన్నారని పనులు పూర్తి చేయకపోవడం వల్ల ఆయకట్టుపై సమస్యలు ఉత్పన్నమవుతున్నట్లు పేర్కొన్నారు. వర్షాకాలంలో సేద్యం పనులు మొదలుతాయని ఈ వేసవిలోనే పనులు వేగంగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కారు, మోటార్ సైకిల్ ఢీ



మల్దకల్: కారు, మోటార్ సైకిల్ ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఒకరు తీవ్రంగా గాయపడిన ఘటన ఆదివారం మండలంలోని బూడిదపాడు గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. గద్వాల పట్టణానికి చెందిన వేణుగోపాల్ నాయుడు మోటార్ సైకిల్‌పై అయిజ నుంచి గద్వాలకు వెళ్తుండగా గద్వాల నుంచి శేషంపల్లికు వెళ్తున్న మల్దకల్ సింగిల్ విండో అధ్యక్షుడు తిమ్మారెడ్డికి చెందిన కారు టైరు పగిలి ప్రమాదవశాత్తు మోటార్ సైకిల్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో మోటార్ సైకిల్‌పై ప్రయాణిస్తున్న వేణుగోపాల్ నాయుడు తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన వ్యక్తిని గద్వాల ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. మెరుగైన వైద్యం కోసం కర్నూల్ ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

మిడ్జిల్: మండలంలోని వెలుగొమ్ములలో ఆదివారం బాల్య వివాహం జరుగుతున్నట్లు సమాచారం అందడంతో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అధికారులు గ్రామానికి వెళ్లి వివాహాన్ని అడ్డుకున్నారు. పెళ్లి వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. మైనర్లకు వివాహం జరపడం చట్టరీత్యా నేరమని తెలిపారు. అనంతరం మైనర్ అమ్మాయిని మహబూబ్‌నగర్‌లోని సఖి కేంద్రానికి తరలించారు.

పెద్దవాగుకు ముళ్లపొదల గండం

- వాగునిండా ముళ్లపొదలు
- వరదకు అడ్డుకట్టగా మారితే ప్రమాదం
- గతంలో ముంచెత్తిన వరద

అయిజ: మున్సిపాలిటీ నడిబొడ్డున ఉన్న పెద్దవాగులో గత కొన్ని సంవత్సరాలుగా దట్టమైన ముళ్ల పొదలు పెరిగి ప్రమాదకరంగా మారింది. గతంలో పెద్దవాగు ఇసుక మేటలతో నీటి చెలిమలతో ఆహ్లాదకరంగా ఉండేంది. ఇప్పుడు దట్టమైన ముళ్లపొదలతో భయానక వాతావరణాన్ని తలపిస్తోందని ప్రజలు పేర్కొన్నారు. ఎటు చూసినా ముళ్ల పొదలు పెరగడంతో వాగు స్వరూపం పూర్తిగా మారిపోయింది.

గతంలో పట్టణాన్ని ముంచెత్తిన వరద..

వాగుపైన తాటికుంట, ముచ్చోనిపల్లి రిజర్వాయర్లు నిర్మించడంతో వరద నీరంతా రిజర్వాయర్లలోకి వెళ్తుంది. రిజర్వాయర్లు నిండిన అనంతరం ఆ నీరంతా పెద్దవాగులోకి చేరుకుంటుంది. ఆ సమయంలో పెద్ద వర్షాలు కురిస్తే వాగులో ప్రవహించాల్సిన వరదనీరు వాగు పక్కన ఉన్న ఇళ్లు, వ్యాపార దుకాణాల్లో ప్రవహిస్తుంది. 2009లో వరద పట్టణాన్ని ముంచెత్తడంతో వాగు పక్కన ఉన్న ఇళ్లు, వ్యాపార దుకాణాల్లోకి నీరుచేరి రూ.కోట్లలో ఆస్తి నష్టం వాటిల్లిందని ప్రజలు వాపోతున్నారు. ప్రస్తుతం ముళ్ల పొదలు తొలగించకుంటే అదే పరిస్థితులు పునరావృతమయ్యే అవకాశాలున్నాయని పేర్కొన్నారు.

ప్రమాదం పొంచి ఉన్న ప్రాంతాలు..

పెద్దవాగులోని ముళ్ల పొదలను తొలగించకుంటే వాగు పక్కన కాలనీలు వరద తాకిడికి గురికావాల్సి ఉంటుంది. ముఖ్యంగా మాలపేట, కొత్త బస్టాండ్‌లో కొంత భాగం, అంబేడ్కర్‌చౌక్, ఉప్పలదొడ్డిపేట, ఎస్సీ కాలనీ, కమతంపేట, గుర్రంతోట, మేకలపేట, తెలుగుపేట, కుర్వపేట ముంపునకు గురవుతాయి. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి వర్షాకాలం ప్రారంభం కాకమునుపే వేసవిలో పెద్దవాగును శుభ్రం చేసి ముళ్లపొదలు తొలగించి వాగు పరిసర ప్రాంతాలను ఆహ్లాదకరంగా మార్చాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



పెద్దవాగులో దట్టమైన ముళ్ల పొదలు

15 ఏళ్ల క్రితం భారీ వరద..



పట్టణంలోని పెద్దవాగులో ముళ్లపొదలు పెరిగిపోవడంతో వాగుకు వచ్చే వరదకు అడ్డుకట్టలా మారాయి. 2009లో వాగుకు వచ్చిన వరద పట్టణంలోని లోతట్టు ప్రాంతాలను ముచ్చెత్తింది. దీంతో చాలా వరకు ఆస్తి నష్టం జరిగింది. అధికారులు వాగును పరిశుభ్రం చేయాలి.

\- నాగరాజు, అయిజ

ముళ్లపొదలు తొలగిస్తాం..



పెద్దవాగులో ముళ్ల పొదలు తొలగించేందుకు ప్రస్తుతం మున్సిపాలిటీలో నిధులు లేవు. తీర్మానం చేసేందుకు ఇప్పుడు పాలకవర్గం లేదు. సమస్యను ఉన్నతాధికారులకు తెలియజేస్తాం. నిధులు మంజూరైన వెంటనే ముళ్లపొదలు తొలగింపు చర్యలు చేపడుతాం.

\- రాజశేఖర్, మున్సిపల్ ఏఈ, అయిజ

హామీలు తక్షణమే అమలు చేయాలి

శాంతినగర్: కేంద్ర ప్రభుత్వం రైతాంగానికి ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని తెలంగాణ రైతాంగ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపాల్ డిమాండ్ చేశారు. సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేయం) జాతీయ కమిటీ పిలుపుమేరకు వడ్డేపల్లి పుర పరిధిలోని శాంతినగర్ అంబేడ్కర్ చౌరస్తాలో ఆదివారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా గోపాల్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఎంఎస్పీ చట్టం, రుణ విముక్తితోపాటు రైతులకు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలన్నారు. నూతన జాతీయ మార్కెటింగ్ ముసాయిదాను రద్దు చేయాలన్నారు. మూడు వ్యవసాయ చట్టాలను మళ్లీ అమల్లోకి తీసుకొచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందని మండిపడ్డారు. విద్యుత్ సవరణ బిల్లును రైతు సంఘాలతో చర్చించకుండా పార్లమెంట్‌లో ప్రవేశపెట్టమని రాతపూర్వకంగా హామీ ఇచ్చి వాటిని తుంగలో తొక్కారన్నారు. కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి నిధుల్లో కోత విధించారని ఆరోపించారు. గట్టు ఎత్తిపోతల పథకానికి నిధులు కేటాయించి పనులు పూర్తి చేయాలని, జూరాల ప్రాజెక్టులో పూడిక తీయాలని, ఆర్డీఎస్ ఆధునికీకరణ చేపట్టి 15.9 టీఎంసీలు విడుదలయ్యేలా చర్యలు తీసుకుని చివరి ఆయకట్టు వరకు సాగునిరందించి అన్నదాతలను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో సామాజికి కార్యకర్త గోపాల్‌రెడ్డి, తెలంగాణ జన సమితి అలంపూర్ ఇన్‌చార్జి వై.రామ్మోహన్, లింగేశ్వర్ రెడ్డి, రామకృష్ణ, తిక్కన్న, గోపాల్ పక్కీరన్న, సుదర్శన్, హలీబాబు, రైతులు పాల్గొన్నారు.



శాంతినగర్‌లో ధర్నా చేస్తున్న రైతాంగ సమితి నాయకులు

ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో రహదారి దిగ్బంధం

గట్టు: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలనకు నిరసనగా అంతర్రాష్ట్ర రహదారి కర్నూలు–రాయచూర్ రోడ్డుపై బల్గెర వద్ద ఆదివారం ఎమ్మార్పీఎస్ నాయకులు దిగ్బంధించి ఆందోళన చేపట్టారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆదేశానుసారం ఎస్సీ వర్గీకరణ అమలు కోరుతూ ఆందోళనలు చేపట్టినట్లు నాయకులు తెలిపారు. దీంతో రహదారిపై భారీగా వాహనాలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బల్గెర ఏసన్న మాట్లాడుతూ.. ఏబీసీడీ వర్గీకరణ చట్టం అమలు చేశాకే గ్రూప్–1, గ్రూప్–2 ఫలితాలను విడుదల చేస్తామని హామీ ఇచ్చారని కానీ చట్టం అమలు కాక ముందే ఫలితాలు విడుదల చేస్తామని ప్రకటించడం అన్యాయమన్నారు. దానికి నిరసన రహదారిపై నిరసన చేపట్టినట్లు తెలిపారు. ఇప్పటికైనా సీఎం రేవంత్ రెడ్డి మాదిగ ఉప కులాలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుని ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలన్నారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఆందోళన విరమించేలా చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కోకన్వీనర్ బండారి డేవిడ్, తెలంగాణ వ్యవసాయ వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి నర్సింహులు, గంగిమాన్‌దొడ్డి సంతోష్, మాచర్ల ఆనంద్, అరగిద్ద తోలు భీమయ్య, వెంకట్, రత్నం, నర్సింహులు, సామేలు, సాల్మన్, సుధాకర్, నర్సప్ప తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ప్రయాణం.. ప్రమాదభరితం



బొలెరోలో కూలీలను తరలిస్తున్న దృశ్యం

ధరూరు: మండలంలో కూలీలను నిత్యం గూడ్స్ వాహనాల్లో తరలిస్తున్నా పట్టించుకునే నాథులే కరువయ్యారు. గద్వాల మండలంతో పాటు ఇటిక్యాల తదితర మండలాలకు మిరప, పత్తి పంటలో పనులు చేయించుకునేందుకు నిత్యం పదుల సంఖ్యలో వాహనాలు పరిమితికి మించి కూలీలను తరలిస్తున్నారు. మితిమీరిన వేగంతో కూలీలను తరలిస్తున్నా అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని ప్రజలు ఆందోళనలో ఉన్నారు. ఆదివారం సాయంత్రం గద్వాల మండలంలోని ఆయా గ్రామాల్లో మిరప పంటకు కూలీలను కేటీదొడ్డి మండలానికి చెందిన కూలీలను మూడు వాహనాల్లో తరలించినట్లు స్థానికులు పేర్కొన్నారు.

స్వర్ణోత్సవ సభలో పుస్తకావిష్కరణ

వనపర్తి విద్యావిభాగం: తెలంగాణ రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ ధర్మ పీఠం స్వర్ణోత్సవం సభలో వనపర్తి పట్టణానికి చెందిన డాక్టర్ బైరోజు శ్యాంసుందర్ పరిశోధనా గ్రంథాన్ని మాజీ శాసనసభ సభాపతి, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి ఆవిష్కరించారు. ఆదివారం హైదారాబాద్ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో విశ్వ బ్రాహ్మణ ధర్మ పీఠం ఆధ్వర్యంలో స్వర్ణోత్సవ సభలు నిర్వహించారు. ఈనాటి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై 2015 సంవత్సరంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీ పట్టాను పొందిన డాక్టర్ శ్యాంసుందర్ సిద్ధాంత గ్రంథాన్ని ఆవిష్కరించారు. విశ్వకర్మ సంస్కృతి సాంప్రదాయానికి సంబంధించి సాహిత్యం ఎంతో ఉందని, దానిపై మరిన్ని పరిశోధనలు జరగాలని మధుసూదనాచారి సాహితీవేత్తలను కోరారు. ఈనాటి కార్యక్రమంలో సభాపతి డా.త్రిమూర్తుల గౌరీశంకర్, లాలుకోట వెంకటాచారి, దైవజ్ఞశర్మ తదితరులు పాల్గొన్నారు. నిర్వాహకులు డాక్టర్ శ్యాంసుందర్‌ను శాలువా పూలమాల జ్ఞాపికతో సత్కరించారు. ఈ మేరకు వనపర్తి జిల్లా సాహితీ కళా వేదిక అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్, ప్రతినిధులు జనజ్వాల, బండారు శ్రీనివాస్, నరేష్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

కాల్వ బ్రిడ్జిపై తప్పని తిప్పలు



ఇటిక్యాల: మండల పరిధి మునుగాల స్టేజీ సమీపంలోని కాల్వ బ్రిడ్జిపై రోడ్డు ఇరుకుగా ఉండడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. బ్రిడ్జిపై ప్రయాణించాలంటే వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. బ్రిడ్జికి ఇరువైపులా గుంతలు పడిన రోడ్డుకు మరమ్మతు చేయాల్సి ఉన్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. బ్రిడ్జిపై ఇరుకుగా ఉండటంతో ఎదురుగా వచ్చే వాహనాలు గమనించకపోవడంతో తరుచూ ప్రమదాల బారిన పడుతున్నారు. అదే విధంగా మండల కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారి సైతం గుంతల మయంగా మారడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఉన్నాతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

రోడ్డుకు మరమ్మతు చేపట్టండి



అయిజ: మున్సిపాలిటీలోని పాత బస్టాండ్‌లోని సర్కిల్‌లో రోడ్డు శిథిలమై ప్రయాణానికి ప్రతికూలంగా మారింది. ఎక్లాస్‌పురం, తూంకుంట, గద్వాల, అయిజ రోడ్లకు సంబంధించిన నాలుగు రోడ్ల కూడలిలో బీటీరోడ్డు శిథిలం కావడంతో ప్రయాణికులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. రోడ్డు శిథిలం కావడంతో తరుచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నట్లు తెలిపారు.. అధికారులు స్పందించి కూడలిలో రోడ్డుకు మరమ్మతు చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

పన్ను చెల్లించి అభివృద్ధికి సహకరించండి

ఆత్మకూర్: సకాలంలో పన్నులు చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి పట్టణ ప్రజలు సహకరించాలని కమిషనర్ శశిధర్ అన్నారు. ఆదివారం సిబ్బందితో కలిసి ఇంటింటికీ వెళ్లి పన్నులు వసూలు చేశారు. ఈ ఏడాది పన్నుల లక్ష్యం రూ.2.23 కోట్లకు గాను ఇప్పటి వరకు రూ.1.13 కోట్లు వసూలు కాగా సుమారు రూ.1.10 కోట్లకు పైగా బకాయిలు పేరుకుపోయాయని తెలిపారు. పట్టణంలో అభివృద్ధి కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయని, వేసవి సందర్భంగా తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలి

అడ్డాకుల: రాష్ట్రంలో రూ.398 వేతనంపై పని చేసిన వేలాది మంది స్పెషల్ టీచర్లకు వారి సరీస్సు కాలానికి ప్రభుత్వం నోషనల్ ప్రాతిపదికన ఇంక్రిమెంట్లు ఇవ్వాలని తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మావిళ్ల లక్ష్మణ్‌గౌడ్, వెంకట నారాయణ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. స్పెషల్ టీచర్ల విద్యా సేవలను గుర్తించి వారికి ఇచ్చిన హామీని సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే అమలు చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

ప్రతి ఊరిలో బడి, గుడి తప్పనిసరి



ఇందువాసిలో ఆలయ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి



ఆలయ ప్రారంభోత్సవంలో బీఆర్ఎస్ నాయకులు

గట్టు: ప్రతి ఊరిలో బడి, గుడి తప్పనిసరిగా ఉండాలని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. పిల్లలు బడికెళ్లి చదువుకుంటే జ్ఞానం లభిస్తుందని, పెద్దలు గుడికి వెళ్తే గ్రామాల్లో శాంతియుత నెలకొంటుందన్నారు. ఆదివారం ఇందువాసి గుట్టపై నూతనంగా నిర్మించిన ఇంజమ్మవ్వ దేవాలయం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామస్తులు ఐక్యంగా ఉంటూ గ్రామ అభివృద్ధికి పాటుపడాలన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బోయ వెంకట్రాములు, స్టేట్‌కన్స్యూమర్ ఫెడరేషన్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గట్టు తిమ్మప్ప, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ జంబురామన్‌గౌడు, మాజీ ఎంపీపీ విజయ్‌కుమార్, గడ్డం కృష్ణారెడ్డి, బస్వరాజ్‌గౌడ్, వీరేష్ గౌడ్, రమేష్, వెంకటేష్, తిమ్మప్ప, మహబూబ్, మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా నియోజకవర్గ బీఆర్ఎస్ నేత బల్గెర హనుమంతునాయుడు, మాజీ జెడ్పీటీసీ బాసు శ్యామల ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

శాశ్వత అభివృద్ధి పథకాలు

గద్వాలటౌన్: జిల్లా కేంద్రంలోని ప్రజల దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని శాశ్వత అభివృద్ధి పథకాలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి అన్నారు. అమృత్–2 పథకంలో భాగంగా చేపడుతున్న తాగునీటి శుద్ధికేంద్రాల నిర్మాణ పనులకు ఆదివారం ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణ శివారు, విలీన కాలనీలో తాగునీటి ఎద్దడిని శాశ్వతంగా నివారించేందుకు అమృత్–2 పనులు చేపడుతున్నట్లు తెలిపారు. భవిష్యత్ తరాలకు తాగునీటి సమస్య ఉండదన్నారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ నాయకులు నాగిరెడ్డి, మురళి, నరహరిగౌడ్, శ్రీను, శ్రీకాంత్, గోపాల్, సాయిరెడ్డి, రమేష్, ధర్మనాయుడు, రామాంజీ, నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

కంకర రోడ్డుపై ప్రయాణం ఎన్నాళ్లు ?



కంకర వేసి వదిలేసిన మాన్‌దొడ్డి- తుమ్మిళ్ల రహదారి

రాజోళి: బీటీ రోడ్ల పేరుతో ఉన్న రోడ్లను తవ్వి కంకర వేసి వదిలేశారని, దీంతో నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నట్లు ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏళ్లు గడుస్తున్నా మాన్‌దొడ్డి నుంచి తుమ్మిళ్ల వరకు రోడ్డు నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదని విమర్శిస్తున్నారు. రోడ్డు నిర్మాణం పూర్తయితే పెద్దధన్వాడ, చిన్నధన్వాడ, నసనూరు, మాన్‌దొడ్డి గ్రామాల ప్రజలు రాజోళికి చేరుకునేందుకు అదనంగా 30 కిమీ ప్రయాణం చేయాల్సిన అవసరం ఉండదు. ఈ దూరాన్ని తగ్గించేందుకు రోడ్డు మంజూరు చేసినా కూడా ఇంతవరకు పనులు ముందుకు సాగకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కంకర వేసి వదిలేయడంతో వాహనాలు అదుపు తప్పి ప్రమాదాల బారిన పడుతున్నట్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కర్నూల్‌కు వెళ్లేందుకు ఈ మార్గం గుండా వెళ్తే సుంకేసుల డ్యాం ద్వారా చేరుకోవచ్చని అనుకుంటే, ఎన్నో ఇబ్బందులు పడుతూ ఈ రోడ్డుపై ప్రయాణం చేయాల్సి వస్తుందని, అత్యవసర సమయంలో మరిన్ని కష్టాలు తప్పడం లేదని వాపోతున్నారు. అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని కోరుతున్నారు.

వైభవంగా మల్లికార్జునస్వామి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు



పూజలందుకున్న మల్లికార్జునస్వామి

శాంతినగర్ : వడ్డేపల్లి మండల పరిధిలోని జూలెకల్ సమీపంలో భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి వారి రథోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. జాతర ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు హోమాలు, బిల్వార్చన, రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం పూజలు నిర్వహించారు. అనంతరం శివపార్వతుల కల్యాణ వేడుక జరిపించారు. సాయంత్రం స్వామివారు, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను రథంపై ప్రతిష్ఠించి ఉత్సవం చేశారు. భక్తులు నందికోళ్లతో నృత్యాలు చేశారు. అనంతరం భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఉత్సవ నిర్వాహకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు

శాంతినగర్/అయిజ: పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఆదివారం ముస్లిం సోదరులకు టీవీ మెకానిక్ రఫి ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. స్థానిక పెద్ద మస్జిద్‌లో ప్రత్యేక ప్రార్థనల అనంతరం ఉపవాస దీక్షలు చేస్తున్న ముస్లిం, మైనార్టీ సోదరులకు ఇఫ్తార్ విందు ఇచ్చారు.

– అయిజ మండలంలోని వెంటకాపురంలో గ్రామానికి చెందిన గౌస్ బాషా ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం ముస్లిం సోదరులు విందు చేశారు. కార్యక్రమంలో ముస్లిం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



శాంతినగర్ పెద్ద మస్జిద్‌లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు

డేవిడ్ క్రిపాల్‌ను అభినందించిన జితేందర్‌రెడ్డి

మహబూబ్‌నగర్ క్రీడలు: బీసీసీఐ విజ్జీ ట్రోఫీకి ఎంపికైన మహబూబ్‌నగర్‌కు చెందిన డేవిడ్ క్రిపాల్‌ను రాష్ట్ర క్రీడల వ్యవహారాల సలహాదారుడు ఏపీ జితేందర్‌రెడ్డి అభినందించారు. శాలువ, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. బీసీసీఐ విజ్జీ ట్రోఫీలో ప్రతిభ చాటాలన్నారు. క్రికెట్‌లో ఉన్నత స్థాయికి చేరుకొని రంజీ, భారత జట్టుకు ప్రాతినిథ్యం వహించాలని కోరారు. ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్, ఉపాధ్యక్షుడు సురేష్‌కుమార్, గోపాలకృష్ణ పాల్గొన్నారు.



డేవిడ్ క్రిపాల్‌ను సన్మానిస్తున్న జితేందర్‌రెడ్డి

'రాయల సుభాష్‌చంద్రబోస్ ఆశయాలు కొనసాగిద్దాం'

అమరచింత: మిత, అతివాదులకు వ్యతిరేకంగా పోరాడిన రాయల సుభాష్ చంద్రబోస్ ఆశయాలను నేటి తరం యువకులు ముందుకు తీసుకెళ్లాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ నాయకులు రాజన్న, ప్రసాద్, హన్మంతు అన్నారు. రాయల సుభాష్ చంద్రబోస్ వర్ధంతిని పురస్కరించుకొని మండల కేంద్రంలోని మార్క్స్ భవనంలో ఆదివారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉమ్మడి రాష్ట్రంలో కేంద్ర కమిటీ నాయకుడిగా ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటాలు చేశారన్నారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజల పక్షాన పోరాటాలు చేశారని కొనియాడారు. కార్యక్రమంలో సామేలు, ప్రేమరత్నం, భక్తి, కురుమన్న ఉన్నారు.